ఈనాడు
జయశంకర్ భూపాలపల్లి
మంగళవారం అక్టోబరు 8, 2024

ప్రజల ఆమోదంతోనే 'ఉపాధి' పనులు!


కాలువ పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (పాతచిత్రం)

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రజలను భాగస్వాములుగా చేసి.. ఎలాంటి పనులు నిర్వహిస్తే గ్రామం అభివృద్ధి చెందుతుందో గుర్తించేందుకు ముందుగా గ్రామ సభలు ఏర్పాటుచేయనున్నారు. అక్కడ ఆమోదం పొందిన వాటిపై ప్రణాళికలు తయారు చేస్తారు. రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనులు గుర్తించేందుకు జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహిస్తున్నారు. గ్రామ సభల ద్వారా తీర్మానం చేసిన పనులకు అధిక ప్రాధాన్యం కల్పిస్తారు. గ్రామాల ప్రణాళిక పూర్తయిన తర్వాత మండల ప్రణాళిక, అనంతరం జిల్లా ప్రణాళిక తయారు చేసి ప్రభుత్వానికి నివేదించనున్నారు.

–భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే

30 వరకు గ్రామ సభలు

జిల్లా వ్యాప్తంగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపట్టే ఉపాధి హామీ పనుల గుర్తింపునకు 241 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలను నిర్వహించనున్నారు. మండల, గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శి, రైతులు, గ్రామ ప్రజలు, కూలీలు, ఉపాధి హామీ సిబ్బందితో గ్రామ సభ ఏర్పాటు చేసి పనులకు సంబంధించి ప్రణాళిక తయారు చేస్తారు. ఈసారి ముఖ్యంగా వ్యక్తిగత పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. గ్రామ సభలను ఈ నెల 30 వరకు నిర్వహించి అనంతరం పనుల వివరాలను మండల పరిషత్ అక్కడి నుంచి జిల్లా పరిషత్ ఆమోదానికి పంపించాలి. ఆ తర్వాత జిల్లా కలెక్టర్ ఆమోదంతో జిల్లా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ప్రణాళికలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంటుంది.

వందశాతం పనులు కల్పించాల్సిందే..

గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి కల్పన క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు కావడం లేదనే విమర్శలు ఉన్నాయి. అర్హులైన ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పించడంతోపాటు అడిగిన వారికి జాబ్ కార్డులను అందిస్తారు. చాలా కుటుంబాలకు జాబ్‌కార్డులు ఉన్నా కూడా వందరోజులు పూర్తయిన కుటుంబాలు చాలా తక్కువ ఉంటున్నాయి. ఇలాంటి సమస్యలను అధిగమించి అర్హులైన ప్రతి ఒక్కరికి పని కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

గుర్తించే పనులివే...

☛ సేద్యపు కుంటలు ☛ ఇంకుడు గుంతల నిర్మాణం ☛ టేకు, పండ్ల తోటల పెంపకం ☛ మల్బరీ సాగు ☛ చేపల కుంటల నిర్మాణం ☛ భూగర్భ జలాలు పెంపొందించేలా నీటి సంరక్షణ పనులు ☛ నర్సరీల ఏర్పాటు ☛ ఆనకట్టల నిర్మాణం ☛ సాగునీటి కాలువల పూడికతీత ☛ తదితర గ్రామాభివృద్ధికి అవసరమయ్యే పనులను గుర్తించి వాటిని మండలానికి నివేదించాల్సి ఉంటుంది.

జిల్లాలో మండలాల వారీగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పనిదినాలు

మండలం	మొత్తం జాబ్‌కార్డులు	కూలీల సంఖ్య	కల్పించిన పనిదినాలు	వందరోజులు పూర్తయిన కుటుంబాలు
భూపాలపల్లి	10829	21438	199257	09
చిట్యాల	11796	27791	223770	11
గణపురం	11356	22527	177578	16
కాటారం	9417	19009	196085	15
మహదేవ్‌పూర్	9297	19423	151007	29
మల్హర్‌రావు	8482	18870	179718	15
మొగుళ్లపల్లి	10141	23754	147783	11
మహాముత్తారం	7464	14880	125686	5
పలిమెల	2859	6473	22459	7
రేగొండ	20424	50134	247003	19
టేకుమట్ల	8127	18431	139967	5

● మొత్తం జాబ్‌కార్డులు/● కూలీల సంఖ్య ● కల్పించిన పనిదినాలు/● వందరోజులు పూర్తయిన కుటుంబాలు

ఆమోదించినవే చేయిస్తాం..

-అవినాష్, ఇన్‌ఛార్జి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 241 పంచాయతీల్లో గ్రామసభల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామ సభల్లో ఆమోదించిన పనులనే చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. ఈసారి వ్యక్తిగత పనులకు ప్రాధాన్యంతోపాటు, గ్రామాల్లో భూగర్భ జలాలను పెంపొందించే పనులు గుర్తిస్తాం. జిల్లాలో కూలీలకు వందశాతం పనులు కల్పించేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం.

వంతెన పూర్తయింది.. ఇబ్బంది తప్పింది!





టేకుమట్ల-రాఘవరెడ్డిపేట గ్రామాల మధ్య చలివాగుపై నిర్మించిన ఈ హైలెవల్ వంతెన గతంలో కురిసిన భారీ వర్షాలకు కూలిపోయింది. దీంతో అధికారులు వంతెన పక్కనుంచి ద్విచక్ర వాహనాలు వెళ్లేలా తాత్కాలికంగా ఇసుక వంతెన, వాగులో నుంచి మట్టి రోడ్డు ఏర్పాటు చేశారు. నిర్మాణ పనులకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభించకపోవడంతో అక్కడి పరిస్థితిపై మార్చి 25న 'ఈనాడు' ప్రధాన సంచికలో 'తాత్కాలిక వారధి.. అవస్థలెలా తీరేది..?' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి పనులు పూర్తి చేశారు. ఎట్టకేలకు వంతెన ప్రారంభం కావడంతో వాహనాలకు మార్గం సుగమమైంది.

–ఈనాడు,హనుమకొండ– న్యూస్‌టుడే టేకుమట్ల



స్కందమాత.. అభయ ప్రదాత

కాళేశ్వర క్షేత్రంలోని అనుబంధ ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. అయిదో రోజు శ్రీశుభానందదేవి, సరస్వతీదేవీలు స్కందమాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. – న్యూస్‌టుడే, కాళేశ్వరం

తుది జాబితాపై అధికారుల కసరత్తు

మొదటగా ఎస్‌ఏల భర్తీ..


ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న డీఈవో రాజేందర్

భూపాలపల్లి, న్యూస్‌టుడే: ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి కావడంతో నియామకమైన ఉపాధ్యాయుల తుది జాబితా తయారీపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటించడంతో పాటు వారికి సమాచారం అందజేయనున్నారు. వారికి ఈ నెల 9న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతులమీదుగా నియామక పత్రాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఇప్పటికే పూర్తిచేశామని త్వరలో తుది జాబితా తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. ఎస్‌ఏ ఖాళీ భర్తీ తర్వాత వారు ఎస్‌జీటీలో కూడా ఎంపికైతే వారి పేరు తొలగించి ప్రతిభ ఆధారంగా తదుపరి అభ్యర్థులకు అవకాశం కల్పించనున్నారు. జిల్లాలో 237 ఉపాధ్యాయ స్థానాల భర్తీకి విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన ముగిసింది. మొదటి రోజు పరిశీలన చేయాల్సి ఉండగా సాంకేతిక కారణాలతో ప్రారంభం కాలేదు. 1:3 నిష్పత్తిలో వివిధ విభాగాల్లో ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేపట్టిన విషయం తెలిసిందే.. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీచేసే సమయంలో అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. జాగ్రత్తలు తీసుకోకుండా ఖాళీలను భర్తీ చేస్తే మళ్లీ అధిక సంఖ్యలో మిగిలిపోయే అవకాశం ఉంది. ఉపాధ్యాయుల పదోన్నతుల సమయంలో ఈ పరిస్థితి ఏర్పడింది. కొందరు అభ్యర్థులు రెండు, మూడు సబ్జెక్టుల్లో అదనపు అర్హతలు సాధించడంతో వారు ఒకటి కన్నా ఎక్కువ ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. ఎంపికైనవారు ఆసక్తి ఉన్న ఏదో ఒక పోస్టును ఎంచుకోవడంతో ఖాళీల సమస్య నెలకొంది. దీంతో మొదటగా ఎస్‌ఏ ఖాళీలకు 1:1 నిష్పత్తిలో అభ్యర్థుల తుది జాబితాను రూపొందించి ఏ పోస్టు ఎంపిక చేసుకుంటారన్న విషయంలో ముందుగా డిక్లరేషన్ తీసుకుంటారు. ఎస్‌ఏ ఖాళీలను భర్తీచేసిన తర్వాత ఎస్‌జీటీలో అర్హత సాధిస్తే అవి ఖాళీలుగా మిగిలిపోనున్నాయి. ఆ పోస్టుల్లో తదుపరి ర్యాంకు సాధించిన అభ్యర్థులను ఎంపిక చేసి, అన్ని ఖాళీలు భర్తీ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 10 నుంచి 20 మంది వరకు అభ్యర్థులు రెండు, మూడు ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించారు.

భర్తీ కానున్న పోస్టులు ఇవే..

ఎస్జీటీలు	165
ఎల్పీ హిందీ	7
ఎల్పీ తెలుగు	13
పీఈటీ (తెలుగు)	7
ఎస్ఏ జీవశాస్త్రం	9
,, ఆంగ్లం	6
,, హిందీ	2
,, ఫిజికల్ ఎడ్యుకేషన్	2
,, ఫిజికల్ సైన్సు	3
,, సాంఘికశాస్త్రం	11
,, తెలుగు	4
,, స్పెషల్ ఎడ్యుకేషన్	4

548 మంది ధ్రువపత్రాలు పరిశీలన

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డీఎస్సీ-2024 ఫలితాల్లో ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు 548 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 437 ఖాళీల భర్తీకి 581 మంది అభ్యర్థులను ఎంపిక చేయగా 33 మంది గైర్హాజరయ్యారు. అయితే జిల్లాకు మొత్తం మంజూరైన ఉపాధ్యాయుల పోస్టులు 1,829 వరకు ఉండగా జిల్లా వ్యాప్తంగా 432 మొత్తం సర్కారు బడుల్లో ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులు 1,392 వరకు ఉన్నారు. ఈ నెల 9న చేపట్టే కొత్త నియామకాల్లో జిల్లాలో 237 పోస్టుల భర్తీకి మాత్రమే ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలో ఇంకా 200 వరకు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటాయి. జిల్లాలోని కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నా సబ్జెక్టుల వారీగా ఇద్దరు ఉపాధ్యాయుల చొప్పున పనిచేస్తున్నారు. ఇలాంటి పాఠశాలల్లో ఎక్కువగా ఉన్న ఉపాధ్యాయులను ఖాళీగా ఉన్న పాఠశాలలకు అధికారులు సర్దుబాటు చేస్తే, విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు జిల్లాలో సుమారు 70 మంది వరకు డీఎస్సీ ఫలితాల్లో ఎంపిక కాగా.. వీరికి ధ్రువీకరణ పత్రాల పరిశీలన నిర్వహించకపోవడంతో వారు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని జిల్లాల్లో కోర్టు కేసుల కారణంగా స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేపట్టలేదని చెప్పారు.



ఈవీ.. ఛార్జింగ్ కేంద్రాలేవీ?

● ఓరుగల్లులో పెరుగుతున్న విద్యుత్తు వాహనాలు

ప్రయివేటు కంపెనీలు ఏర్పాటుచేసిన రెండు మూడు చిన్న ఛార్జింగ్ పాయింట్లు మాత్రమే వరంగల్ ప్రాంతంలో ఉన్నాయి.

'మూడేళ్ల కిందట తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల సంస్థ (టీజీ రెడ్కో) నగరంలో పది ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసేందుకు సర్వే చేపట్టింది. విద్యుత్తు సబ్‌స్టేషన్ల పరిధిలో ఏర్పాటుచేస్తామని ప్రకటించింది. ఆ ప్రతిపాదనలు అటకెక్కాయి.'



ఈనాడు, వరంగల్, రంగశాయిపేట, న్యూస్‌టుడే


రోజురోజుకు పెరిగిపోతున్న పర్యావరణ కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు, ఆకాశాన్నంటుతున్న ఇంధన ధరల భారం తగ్గించేందుకు ప్రభుత్వాలు విద్యుత్తు వాహనాలను (ఈవీ) ప్రోత్సహిస్తున్నాయి. ఈ క్రమంలో రాజధాని హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరమైన వరంగల్‌లో ఈ వాహనాలను విక్రయించే షోరూంల సంఖ్య పెరుగుతోంది. ఈ- కార్లు, విద్యుత్తు ఆటోలు, ఇతర పెద్ద ఎలక్ట్రిక్ వాహనాల కోసం నగరంలో సరిపడా ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడం పెద్ద లోటు. హైదరాబాద్ పరిధిలో ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసిన రెడ్కో ఓరుగల్లులో పెట్టకపోవడంతో సుదూరాల నుంచి నగరానికి వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి.

స్టేషన్ల ఏర్పాటు ఎంతో అవసరం


వరంగల్‌లో ప్రయివేటు ఎలక్ట్రిక్ ఛార్జింగ్ పాయింట్

వాహనాల్లో పెట్రోలు, డీజిల్ వేయించుకోవడం సులువు. రెండు మూడు నిమిషాల్లో పూర్తవుతుంది. అదే విద్యుత్తు ఛార్జింగ్‌కు చాలా సమయం పడుతుంది. గంటల తరబడి వేచి చూడాల్సి ఉంటుంది. ఈ క్రమంలో స్టేషన్లు ఉంటే కూర్చునేందుకు కుర్చీలు, మంచినీటి సౌకర్యం ఉంటాయి. వీటిని ప్రభుత్వం ఏర్పాటుచేస్తే విద్యుత్తు ధరలు కూడా తక్కువగా ఉంటాయి.


● నగర వాసులు డీజిల్, పెట్రోల్ నుంచి ఎల్పీజీ, సీఎన్‌జీకి. . ఇప్పుడు క్రమంగా ఈవీలపై ఆసక్తి చూపుతున్నారు. 2022లో హనుమకొండ జిల్లాలో ఎలక్ట్రానిక్ ద్విచక్ర వాహనాలు 375 రిజిస్ట్రేషన్ కాగా.. గతేడాది 736, ఈ ఏడాది ఇప్పటికే 950 దాటిపోయాయి. కార్ల కొనుగోలుపై నగర వాసులు ఆసక్తి చూపుతున్నారు. రెండేళ్ల కిందట 15 ఉండగా, గతేడాది 67కు చేరాయి. ఈ ఏడాది ఇప్పటికే 36 దాటిపోయాయి. డిసెంబరుకల్లా వందకు చేరే అవకాశం ఉంది.




విద్యుత్తు ద్విచక్రవాహనం


ఈవీ ఆటో

నిట్ సాంకేతిక అండ


ఈవీ ఛార్జింగ్ స్టేషన్లపై నిట్ రూపొందించిన ప్రాజెక్టు

నగరంలో ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు వరంగల్ జాతీయ సాంకేతిక సంస్థ పూర్తి సాంకేతిక సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంది. రెండేళ్ల కిందట 'ఆప్టిమల్ లొకేషన్ ఆఫ్ ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్స్ ఫర్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ ఇన్ వరంగల్' అనే పేరుతో ప్రాజెక్టు చేపట్టింది. నిట్‌లోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ పేర్లి సురేశ్‌బాబు నేతృత్వంలో దీన్ని పూర్తి చేశారు. నగరంలో వాహనాల రద్దీ దృష్ట్యా ఈవీ ఛార్జింగ్ కేంద్రాలు ఎక్కడెక్కడ వస్తే బాగుంటుంది.. సబ్‌స్టేషన్ల నుంచి ఏ మేరకు విద్యుత్తు అవసరం ఉంటుందని లోతుగా అధ్యయనం చేసి పరిశోధన పత్రం రాస్తే అది స్విట్జర్లాండ్ జర్నల్‌లో ప్రచురితమైంది. నగరంలో 39 కేంద్రాలు ఏర్పాటుచేయాలని ఆ ప్రాజెక్టు ద్వారా గుర్తించారు.

కార్లకు కష్టమే - శ్రీకాంత్, హనుమకొండ



నాకు ద్విచక్ర విద్యుత్తు వాహనం ఉంది. ఇంట్లోనే ఛార్జింగ్ పెట్టుకుంటాను. మా స్నేహితులు హైదరాబాద్ నుంచి హనుమకొండకు వచ్చినప్పుడు అదనపు బ్యాటరీలు తెచ్చుకుంటున్నారు. లేదా మా ఇంట్లో ఛార్జింగ్ పెట్టడం వల్ల గంటల తరబడి సమయం వృథా అవుతోంది. ఛార్జింగ్ స్టేషన్ ఉంటే కొద్ది సమయం సరిపోతుంది. ఓరుగల్లు నగరంలో ప్రభుత్వం ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయాలి.

ఆర్టీసీ కూడా మరిచింది

వరంగల్ రీజియన్ ఆర్టీసీ బస్సుల్లో కొన్ని ఈవీలను వినియోగిస్తామని మూడేళ్ల కిందట ప్రకటించారు. ఇప్పటికే హైదరాబాద్‌లో ఆర్టీసీ అనేక ఈ బస్సులను తీసుకొచ్చింది. అదే స్ఫూర్తితో మొదటి దఫాలో ఓరుగల్లు నగరంలో 10 విద్యుత్తు బస్సులు తెస్తామని ప్రకటించి.. అంతటితో ఆ ప్రతిపాదన అటకెక్కించింది.

దిల్లీ విధానం భేష్



కేంద్ర ప్రభుత్వం 2030 కల్లా దేశంలో సగానికి సగం విద్యుత్తు వాహనాలనే రహదారులపై తీసుకురావాలనుకుంటోంది. ఈ క్రమంలో దిల్లీ ప్రభుత్వం అక్కడి వాయు కాలుష్యం దృష్ట్యా ఈవీలను బాగా ప్రోత్సహిస్తోంది. 'స్విచ్ దిల్లీ' పేరుతో పాలసీ రూపొందించింది. 30 వేల ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటుచేస్తోంది. ఇప్పటికే 2,452 ఏర్పాటు చేసింది. ఛార్జింగ్ స్టేషన్లు 1,919 ఉన్నాయి.

రుణమాఫీ ప్రక్రియపై హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే : రుణమాఫీ ప్రక్రియపై రైతులకు, సలహాలు సూచనలు అందించేందుకు జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంతో పాటు భూపాలపల్లి, మహదేవపూర్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవసాయాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడుతూ రుణమాఫీ ప్రక్రియపై రైతుల నుంచి దరఖాస్తులు వస్తున్నాయని.. సమస్యలు నివృత్తి చేసేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయ్‌భాస్కర్ 7288894787, సహాయ వ్యవసాయ సంచాలకులు బాబు 7288894710, భూపాలపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు రమేశ్ 7288894771, మహదేవ్‌పూర్ వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీపాల్ 7288894760 నెంబర్లకు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. కార్యాలయ పని వేళల్లో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయాలకు వచ్చి లేదా ఫోన్ ద్వారా రైతులు రుణమాఫీకి సంబంధించిన సమస్యల గురించి తెలుసుకోవచ్చని చెప్పారు. ఫిర్యాదులపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

విన్నవించాం.. పరిష్కరించండి!


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. వారి సమస్యలను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం 44 దరఖాస్తులు వచ్చాయని.. గతంలో 383 దరఖాస్తులు రాగా అందులో 205 పరిష్కారం అయ్యాయని 183 పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. వచ్చేవారం వరకు ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల ప్రగతి నివేదికలు అందించాలని ఆదేశించారు.



పంట రుణమాఫీ చేయాలి..

- చిట్యాల మండలం, గిద్దెముత్తారం రైతులు

పంటల సాగుకు పెట్టుబడి అవసరమై బ్యాంకులో రూ.2 లక్షలకు పైగా పంట రుణాలు తీసుకున్నాం.. రాష్ట్ర ప్రభుత్వం రూ. 2 లక్షల్లోపు రుణమాఫీ చేసినా దాంట్లో మా పేర్లు లేవు.. కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధచూపి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి.

ధ్రువపత్రాల పరిశీలన చేపట్టాలి..

- స్పెషల్ ఎడ్యుకేటర్స్, భూపాలపల్లి జిల్లా



డీఎస్సీ-2024 నియామకాల్లో భాగంగా జిల్లాలోని స్పెషల్ ఎడ్యుకేటర్(ఎస్‌జీటీ, ఎస్‌ఏ) అర్హత పొందినా మా ధ్రువపత్రాల పరిశీలన చేపట్టడం లేదు. కొన్ని జిల్లాల్లో 1:3 పద్ధతిన పరిశీలించారు. అధికారులను అడిగితే కోర్టులో కేసు నడుస్తున్నందున ధ్రువపత్రాల పరిశీలన చేపట్టడం లేదని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలని అంటున్నారు. ఇతర జిల్లాల్లో సాధ్యమైనది ఇక్కడ ఎందుకు సాధ్యం కావడం లేదు.

పంట ఆక్రమించేందుకు యత్నం

- బానోత్ రజిత, గిద్దెముత్తారం చిట్యాల మండలం



గిద్దెముత్తారం శివారులో మాకు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు భూమిని సాగు చేసుకోనివ్వకుండా బెదిరింపులకు గురిచేస్తున్నారు. పంట భూమిలోంచి 20 గుంటలు ఇస్తేనే సాగు చేసుకోనిస్తామని ఇబ్బందులు పెడుతున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం ఉండటం లేదు. కలెక్టర్ న్యాయం చేయాలి.

ఎంబీబీఎస్ సీటు వచ్చినా.. ఆర్థిక స్తోమత లేదు..

- బొట్ల రాము, చిన్నకోడెపాక, కొత్తపల్లిగోరి మండలం



నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు వచ్చింది. నిరుపేద కుటుంబానికి చెందిన నాకు ఖర్చులు భరించే స్తోమత లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాను. ఏటా రూ.లక్ష ఖర్చవుతుంది. కలెక్టర్ దయచూపి ఎంబీబీఎస్ పూర్తయ్యేందుకు అవసరమైన ఆర్థిక సాయం అందించాలని వేడుకుంటున్నాను. దాతలు ఎవరైనా ఉంటే ఆదుకోవాలి.

బీమా డబ్బులు.. దళిత బంధులో ఖాతాలో జమచేశారు.

- గాజుల శారద, భూపాలపల్లి




దళిత బంధు పథకం ద్వారా కారు తీసుకొని.. తొమ్మిది నెలల వరకు వాహనం కిరాయికి నడుపుతు జీవనోపాధి పొందాను. కొన్ని రోజుల క్రితం కారును మా ఇంటి ముందు ఉండగా రాత్రి సమయంలో విద్యుదాఘాతంతో దగ్ధమైంది. పోలీసులు వచ్చి పంచనామా చేశారు. ఇన్సూరెన్స్ వారు పరిశీలించారు. వారు బీమా డబ్బులను దళిత బంధు ఖాతాలో వేశారు. డబ్బులను డ్రా చేయడం ఇబ్బందిగా మారింది. కలెక్టర్ చొరవచూపి డబ్బులను అందించేలా చూడాలి.



నెట్టింట్లో.. అమ్మేస్తున్నారు!

● అరుదైన జంతువుల అక్రమ రవాణా

ఈనాడు, జయశంకర్ భూపాలపల్లి



ఉమ్మడి వరంగల్ జిల్లా అడవుల్లో వన్యప్రాణులకు నెలవైన ప్రాంతాలున్నాయి. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో గోదావరి తీరం వెంట దట్టమైన, పచ్చని అడవుల్లో జంతువుల ఆవాసానికి అనుకూలంగా ఉంటుంది. వేటగాళ్లతో వాటికి ముప్పు వాటిల్లుతోంది.. గుట్టుగా వేటాడి వన్యప్రాణుల చర్మాలు, గోళ్లు, మాంసంతో వ్యాపారం చేసుకుంటున్నారు. అధికారులు చర్యలు తీసుకుంటున్నా.. వేట మాత్రం ఆగడం లేదు.. గత శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఘటన అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అరుదైన జంతువులను ఏకంగా ఆన్‌లైన్‌లో విక్రయానికి పెట్టారు. నూతన పంథాలో దుండగులు పాంగోలిన్(అలుగు)ను అక్రమ రవాణా చేసేందుకు సిద్ధమయ్యారు.

చెన్నై బ్యూరో సభ్యులు మాటేసి..

ఇక్కడ ఇంత తతంగం జరుగుతున్నా.. స్థానిక అధికారులు ఈ విషయాన్ని పసిగట్టలేదు. వాట్సాప్ గ్రూపును చెన్నై కేంద్రంగా నడిచే వైల్డ్ లైఫ్ క్రైమ్ కంట్రోల్ బోర్డు గుర్తించింది. ఆ వాట్సాప్ గ్రూప్‌లో బ్యూరో సభ్యులు కొనుగోలుదారులుగా సంప్రదింపులు చేశారు. ఇద్దరు సభ్యులు ఆ నెంబర్ల ఆధారంగా చాట్ చేసుకుంటూ వరంగల్ చేరుకున్నారు. దుండగులు చెప్పినట్లుగా భూపాలపల్లి, కాటారం ప్రాంతాలకు వచ్చారు. మాటు వేసి అలుగును, ముగ్గురు నిందితులను పట్టుకున్నారు.

వాట్సాప్ గ్రూపు ఏర్పాటు..

పాంగోలిన్ లాంటి అరుదైన వన్యప్రాణుల విక్రయాలకు దేశవ్యాప్తంగా పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు సమాచారం. పురాతన వస్తువుల పేరిట దేశవ్యాప్త నెట్‌వర్క్‌తో ఓ వాట్సాప్ గ్రూపు నడుపుతున్నారు. ఇందులో భూపాలపల్లి జిల్లాకు చెందిన కొందరు ఉన్నట్లు తెలిసింది. వారే అలుగు ఫొటోలను అప్‌లోడ్ చేసి అమ్మకానికి పెట్టారు.. ఇలాంటి నెట్‌వర్క్‌తో ఇక్కడి వారికి సంబంధాలు ఉండటం విస్తుగొల్పుతోంది. ఎన్నేళ్లుగా ఈ అక్రమ వ్యాపారం జరుగుతుందో తెలుసుకునే పనిలో అటవీ అధికారులు, పోలీసులు ఉన్నారు.

మరో 8 మంది గుర్తింపు..

అలుగు విక్రయంలో ముందుగా ముగ్గురిని పట్టుకున్నారు. అయితే దీని వెనుక తతంగం నడుపుతున్న 8 మందిని గుర్తించారు. కాటారం, భూపాలపల్లి, మహాముత్తారం మండలాలకు చెందిన వివిధ రంగాలకు చెందిన వారుండటం గమనార్హం. అందులో ఓ రాజకీయ నేత కూడా ఉన్నాడు. ఐదుగురిని అరెస్టు చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. వారిని పట్టుకుంటే ఈ దందా పూర్తిస్థాయిలో వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు చెందినవారు ఉండే అవకాశం ఉందని ఓ అధికారి చెప్పారు.

అరుదైన జంతు విక్రయాల ముఠాలు..


అంతరించిపోతున్న జంతువును వేటాడేందుకు ముఠాలు తిరుగుతుంటాయి. అలుగు, పులి, చిరుత, వాటి చర్మం, నక్షత్ర తాబేలు, రెండు తలల పాము, ఏనుగు దంతాలకు భారీగా డిమాండ్ ఉంటుందనే అపోహతో వీటికోసం వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. అలుగును ఒకరు రూ.30 వేలకు కొన్నట్లు సమాచారం. వాటి పొలుసులకు డిమాండ్ ఉంటుందనేది ప్రచారంలో ఉంది. ఇది చేతులు మారుతూ రూ.3 లక్షల ధర పలికినట్లు తెలిసింది. అరుదైన జంతువులకు ధరలు ఊహించుకుని వాటిని గుట్టుగా వేటాడుతూ దందా నడుపుతున్నారు.

పర్యవేక్షణ అంతంతే..

రాత్రిళ్లే ఎక్కువగా వేట సాగుతోంది. రాత్రిళ్లు అటవీ అధికారుల పర్యవేక్షణ ఉండటం లేదనే ఆరోపణలున్నాయి. వేటగాళ్లు ఆయుధాలతో ఉంటారు. ఇది అధికారులకు సమస్యగా మారింది. వారికి కూడా రక్షణ కరవైంది. తగిన చర్యలు తీసుకుని ఇప్పటికైనా వేటను అరికట్టాల్సిన అవసరం ఉంది.

ఉచ్చులు.. విద్యుదాఘాతం

జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్ తదితర జిల్లాల్లో దట్టమైన అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులున్నాయి. పులులు, చిరుతలు, జింకలు, దుప్పులు, కొండగొర్రెలు, కుందేళ్లు, అడవి దున్నలు, అడవి పందులు, తదితర జంతువులున్నాయి. రాత్రి వేళల్లో గుట్టుగా విద్యుదాఘాతం, ఉచ్చులతో వేటాడుతున్నారు. విద్యుదాఘతంతో మనుషులకు ప్రమాదాలు జరుగుతున్నాయి. నాలుగేళ్ల క్రితం తాడ్వాయి అడవుల్లో పులిని కూడా వేటాడి చంపారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న అలుగు

వేటను అరికడుతున్నాం..

-వసంత, డీఎఫ్‌వో, జయశంకర్ భూపాలపల్లి

వన్యప్రాణుల వేటను అరికడుతున్నాం. వేటతో జరిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నాం. వన్యప్రాణుల చట్టాలు, శిక్షలపై వివరిస్తున్నాం. రాత్రి పూట గస్తీ బృందాలను ఏర్పాటు చేశాం. ప్రజలు కూడా సహకరించాలి. వన్యప్రాణుల వేటపై సమాచారం ఇవ్వాలని కోరుతున్నాం.

హాని తలపెడితే శిక్ష తప్పదు..

- వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 ప్రకారం కఠిన శిక్షలు ఉన్నాయి. పులిని ఆటపట్టించినా.. భయపెట్టినా ఆరు నెలలు శిక్ష పడుతుంది.
- పులి, అలుగు, ఇతర షెడ్యూల్-1లో పరిధిలోని ప్రాణులను వేటాడితే నాన్‌బెయిలబుల్ కేసు నమోదవుతుంది. 3 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా పడుతుంది.
- రెండోసారి కూడా అదే తప్పుచేస్తే రూ.25 వేల జరిమానా 3 నుంచి 7 సంవత్సరాల జైలు శిక్ష.
- పులి ఉండే అభయారణ్యంలోని కోర్ ఏరియాల్లో వేటాడితే 3 నుంచి ఏడేళ్ల జైలుశిక్ష పడుతుంది. రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు జరిమానా ఉంటుంది.
- రెండు అంతకంటే ఎక్కువసార్లు వేటాడితే రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు జరిమానా, ఏడేళ్ల జైలు శిక్ష పడుతుంది.
- పులిని వేటాడినట్లు సరైన ఆధారాలుంటే నిందితులను వారెంట్ లేకుండానే అరెస్టు చేయవచ్చు..

లలితా మహా త్రిపురసుందరి దేవిగా భద్రకాళి





పల్లకీలో అమ్మవారి ఉత్సవమూర్తి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు సోమవారం శ్రీభద్రకాళి అమ్మవారు లలిత మహా త్రిపురసుందరి(రాజరాజేశ్వరి)గా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తికి పల్లకీ సేవ, సాయంత్రం శేష వాహన సేవ జరిపారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు లలిత మహాయాగంలో పాల్గొన్నారు. 'కుడా' ఛైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. -రంగంపేట, న్యూస్‌టుడే

'బోధనా రుసుం విడుదలైతేనే కళాశాలలు తెరుస్తాం'



రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల సంఘం బాధ్యులు

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు దసరా తరువాత నిరవధికంగా మూసివేస్తున్నట్లు కాకతీయ విశ్వవిద్యాలయ ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల సంఘం బాధ్యులు సోమవారం రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డికి వినతి పత్రం అందజేశారు. మూడేళ్ల నుంచి యాజమాన్యాలకు ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల జాప్యం కారణంగా, పేద, మధ్య తరగతి విద్యార్థుల ఉపకార వేతనాల విడుదలలో ఆలస్యం కారణంగా అధ్యాపకులకు, సిబ్బందికి వేతనాలు చెల్లించలేకపోతున్నామన్నారు. పది నెలలుగా ముఖ్యమంత్రికి, వివిధ శాఖల మంత్రులకు, ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చినా, నేటివరకు ఎలాంటి పరిష్కార నిర్ణయం వెలువడలేదన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పి.ఉపేందర్ రెడ్డి, కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధన

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఈ నెల ఒకటి నాటికి రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించినట్లు వరంగల్ డీసీసీబీ, రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు వెల్లడించారు. రాష్ట్రంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకులకు దీటుగా వరంగల్ డీసీసీబీ ఉత్తమ ఆర్థిక కార్యకలాపాలను నిర్వహిస్తోందని పేర్కొన్నారు. సోమవారం హనుమకొండలోని బ్యాంకు కార్యాలయంలో రవీందర్‌రావు అధ్యక్షతన బ్యాంకు మేనేజర్లు, సీఈవో, అధికారుల సమీక్ష సమావేశం జరిగింది. తొలుత బ్యాంకు రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించినందుకు ఆయన కేకు కోసి బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్‌కు తినిపించారు. అనంతరం జరిగిన సమావేశంలో రవీందర్‌రావు మాట్లాడుతూ తాను ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సమయంలో రూ.12 వందల కోట్లు మాత్రమే టర్నోవర్ ఉందన్నారు. ఈ ఘనత సాధనలో తోడ్పడిన సహకార సంఘాల అధ్యక్షులు, బ్యాంకు మేనేజర్లు, ఉద్యోగులు, సీఈవోలు, ఖాతాదారులకు ధన్యవాదాలు తెలిపారు. రుణమాఫీ పొందిన బ్యాంకు పరిధిలోని రైతులందరికీ వెంటనే కొత్తగా పంట రుణాలు ఇవ్వాలని మేనేజర్లకు సూచించారు. రుణమాఫీకి అర్హతగల రైతుల వివరాలను ప్రభుత్వానికి సమర్పించడంలో నిర్లక్ష్యం వహించే ఉద్యోగులపై జిల్లా సహకార శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఇంకా డీసీసీబీ జీఎం ఉష, డీజీఎం అశోక్, ఏజీఎంలు మధు, స్రవంతి, కృష్ణమోహన్, రాజునాయక్, ఉమ్మడి జిల్లాలోని బ్యాంకుల మేనేజర్లు, సీఈవోలు పాల్గొన్నారు.

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

అట్టహాసంగా రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



లాంగ్ జంప్





అండర్-20 బాలికల 800 మీటర్ల పరుగులో విజేతలు



60 మీటర్ల పరుగు పందెం..

-న్యూస్‌టుడే, వరంగల్ క్రీడావిభాగం

తెలంగాణ అథ్లెటిక్స్ సంఘం సహకారంతో హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో 10వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజులపాటు జరిగే పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి అథ్లెట్లు హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేషీ, స్పోర్ట్స్ ఓఎస్‌డీ రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొదట రాష్ట్రస్థాయి పోటీలు హైదరాబాద్‌లో నిర్వహిస్తే బాగుండు అనుకున్నా.. కానీ! ఇక్కడి జేఎన్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ చూసిన తర్వాత సంతోషం కలిగిందన్నారు. రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం ఛైర్మన్ వరద రాజేశ్వరరావు మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు దీటుగా ఓరుగల్లులో క్రీడాకారులకు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. జేఎన్ స్టేడియంలో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తానని హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి అశోక్‌కుమార్ తెలిపారు. గత నెలలో చెన్నైలో జరిగిన సౌత్ ఏషియన్స్ అథ్లెటిక్స్ ఫెడరేషన్(ఎస్ఏఏఎఫ్) గేమ్స్‌లో వరంగల్ జిల్లా నెక్కొండకు చెందిన వినోద్‌కుమార్ 800 మీటర్ల పరుగులో కాంస్యం, గచ్చిబౌలి అకాడమీకి చెందిన మోహిత్‌చౌదరి 3000 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు సాధించారు. వారిని రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో సత్కరించి నగదు బహూకరించారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన అథ్లెట్లకు అతిథులు వ్యక్తిగత మెడల్స్ అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి, నిర్వహణ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, కోచ్‌లు శ్రీమాన్, నాగరాజు, పీడీలు సాంబమూర్తి, మహేందర్, కృష్ణ, రజినీకాంత్, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి రైళ్ల పునరుద్ధరణ

కాజీపేట, న్యూస్‌టుడే : పక్షం రోజులుగా రద్దయిన రైళ్లు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వరంగల్- హసన్‌పర్తి రోడ్ మధ్య నాలుగో లైను పనుల కారణంగా సెప్టెంబరు 22 నుంచి ఈ నెల 7వ తేదీ వరకు కాజీపేట- బల్లార్షా, వరంగల్- బల్లార్షా మార్గంలో నడిచే దాదాపు అన్ని రైళ్లను రద్దు చేశారు. కొన్ని రైళ్లను దారి మళ్లించారు. దూర ప్రాంత రైళ్లను మాత్రం నడిపించారు. రద్దయిన కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, రామగిరి, ఇంటర్‌సిటీ, సింగరేణిలు 8వ తేదీన, భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ 9వ తేదీ నుంచి ప్రారంభమౌతాయి. పండగ వేళ రద్దు కావడంలో ప్రయాణికులు ఇప్పటికే ఇతర మార్గాల ద్వారా ప్రయాణాలు చేశారు. నేటి నుంచి పునఃప్రారంభం అవుతుండటంతో ఇప్పటికే చాలా మంది రిజర్వేషన్లు చేసుకున్నారు. కాగజ్‌నగర్, ఇంటర్‌సిటీలో వెయిటింగ్ లిస్టు ఎక్కువగా ఉంది.

దోపిడీ దొంగలకు ఏడేళ్ల జైలు శిక్ష

వరంగల్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: పట్టపగలు ఇంట్లో చొరబడి.. విలువైన బంగారు ఆభరణాలు, డబ్బు దోచుకెళ్లిన నలుగురు దోపిడీ దొంగలకు ఏడేళ్ల కఠిన కారాగార జైలు శిక్ష విధిస్తూ.. హనుమకొండ జిల్లా ప్రధాన సహాయ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి క్షమాదేశ్‌పాండే సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు కేసు వివరాలిలా ఉన్నాయి. హనుమకొండ నగరంలోని గణేశ్‌నగర్‌కు చెందిన అలవాల సమ్మయ్య 2014 సెప్టెంబరు 26న మధ్యాహ్నం బయటకు వెళ్లారు. అదే సమయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా గోదావరిఖనికి చెందిన షేక్ అలీ హైదర్, కుమారస్వామి, శంకర్, మధుకర్, కోరుట్లకు చెందిన శివకృష్ణ, మహ్మద్ అసీఫ్ ఒక ముఠాగా ఏర్పడి.. హనుమకొండలోని గణేశ్‌నగర్‌కు వచ్చారు. అలవాల సమ్మయ్య భార్య ఒంటరిగా ఇంట్లో ఉండటాన్ని గమనించారు. బయట ఒకరు కాపలా ఉండి.. మిగతావారు ఇంట్లో చొరబడి ఆమెను బంధించారు. విలువైన వస్తువులు మూటగడుతుండగా.. అదే సమయంలో బయటకు వెళ్లిన సమ్మయ్య ఇంటికి వచ్చారు. బయట ఉన్న వ్యక్తిని ఎవరు నువ్వు అని ప్రశ్నించగా.. అతడు సమ్మయ్యను బలవంతంగా ఇంట్లోకి తీసుకెళ్లి బంధించాడు. అనంతరం ఆభరణాలు, నగదు, చరవాణులతో ఉడాయించారు. బాధితుడు సమ్మయ్య ఫిర్యాదు మేరకు హనుమకొండ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అనంతరం న్యాయస్థానంలో నేరారోపణ పత్రాన్ని దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో కోర్టు పైవిధంగా శిక్ష విధించింది. ఈ కేసును ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ వాదించారు. విచారణ సందర్భంగా కోర్టు కానిస్టేబుల్ సుభాష్ సాక్ష్యులను ప్రవేశపెట్టారు.

నేటి నుంచి రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన

గోపాలపూర్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర చేనేత, జౌళి శాఖల ఆధ్వర్యంలో హనుమకొండలోని ఎన్జీవోస్ కాలనీ రోడ్‌లోని రెడ్డి మ్యారేజ్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నుంచి ఈ నెల 21 వరకు రాష్ట్ర చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వరంగల్ చేనేత, జౌళి శాఖ ఏడీ రాఘవరావు తెలిపారు. ప్రదర్శనలో నాణ్యమైన వస్త్రాలను తక్కువ ధరలకు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో పాల్గొనే చేనేత సహకార సంఘాలు, సంస్థలు ఎలాంటి రుసుం లేకుండా అమ్మకాలు జరుపుకోవచ్చన్నారు. ప్రదర్శనలో పోచంపల్లి, వెంకటగిరి, మంగళగిరి, ఉప్పాడ, చీరాల చీరలు, డ్రెస్ మెటీరియల్స్, కరీంనగర్ బెడ్ షీట్లు, లుంగీలు, టవళ్లు, పత్రంజిలు, కార్పెట్లు తదితరాలు విక్రయిస్తారని తెలిపారు. పలు రాష్ట్రాల నుంచి 60 ప్రాథమిక చేనేత సహకార సంఘాలు పాల్గొంటున్నట్లు రాఘవరావు తెలిపారు.

రసం పీల్చే.. పురుగుల పనిపడదాం..!



ఉమ్మడి వరంగల్ జిల్లాలో పత్తి ప్రధాన వాణిజ్యపంటగా ఉంది. పూత, కాతగా దశలో ఉండగా ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పత్తిలో ప్రధానంగా రసం పీల్చే పురుగులు ఉద్ధృతి పెరుగుతున్న పరిస్థితిని గమనించామని మల్యాల కేవీకే కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మాలతి, పంట ఉత్పత్తి విభాగ శాస్త్రవేత్త బి.క్రాంతికుమార్ తెలిపారు. సస్యరక్షణ చర్యలను 'రైతేరాజు'కు వివరించారు.

–న్యూస్‌టుడే, మానుకోట

పేనుబంక : లేత కొమ్మలు, ఆకుల అడుగు భాగాల నుంచి తల్లి, పిల్ల పురుగులు రసం పీల్చుతాయి. ఆకులు దోనెలుగా మారడం, తేనె వంటి జిగురు పదార్థం విసర్జించడం వల్ల ఆకులపై నల్లని బూజు ఏర్పడుతుంది. నివారణకు ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ లేదా థయోమిథాక్సమ్ 0.2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తామరపురుగు : తల్లిపిల్ల పురుగులు సన్నగా పసుపు రంగులో ఉండి రసం పీల్చుతాయి. ఆకులు పెలుసుగా మారుతాయి. నివారణకు.. మోనోక్రొటోఫాస్ 1.6 మి.లీ లేదా ఎసిఫేట్ 75 ఎస్‌పీ లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ లీటర్ నీటికి లేదా డైఫెన్ థయురాన్ 1.25 గ్రాములు లేదా స్పైనీటోరం 0.9 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పిండినల్లి : చిన్న పురుగులు లేత పసుపు రంగులో ఉంటాయి. తల్లిపురుగులు రెక్కలు లేకుండా మైనపు పూత గల వెంట్రుకలతో కప్పబడి ఉంటాయి. ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడతాయి. నివారణకు ప్రొపెనోఫాస్ 50 ఈసీ లేదా మిథైల్‌పారాథియాన్ 50 ఈసీ ఎసిఫేట్ 2 గ్రాములు+ట్రైటాన్ లేదా సాండొవిట్ లాంటి జిగురు మందులు ఒక మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పచ్చదోమ : ఆకుల అడుగుభాగాన పిల్ల, తల్లి పురుగులు చేరి రసం పీల్చడం ద్వారా ఆకుల ఈనెలు దోనెలుగా ముడుచుకుని పసుపు రంగులో మారుతాయి. నివారణకు.. ఇమిడాక్లోప్రిడ్ లేదా ఫ్లోనికామైడ్ లేదా ఫిప్రొనిల్ లీటరు నీటికి రెండు మి.లీ లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా ఎసిఫేట్ 75 ఎస్‌పీ ఒకటిన్నర గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తెల్లదోమ : పిందె, కాయ దశలో ఆశిస్తుంది. పురుగు సోకిన మొక్కలు గిడసబారి పూమొగ్గలు, కాయలు రాలిపోతాయి. నివారణకు డైఫెన్‌థయురాన్ 1.25 గ్రాములు లేదా స్పైరొమెసిసిన్ ఒక మి.లీ లేదా థయోమిథాక్సమ్ 0.2 గ్రాములు లేదా సల్ఫాక్సాప్లోర్ 0.76 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



మిరపనారు

రైతేరాజు

కొంటున్నారా.. జాగ్రత్త సుమా!

మానుకోట, న్యూస్‌టుడే : మిరపనారు కొనుగోలులో రైతులు జాగ్రత్త వహించాలని మహబూబాబాద్ జిల్లా ఉద్యానశాఖ అధికారి జినుగు మరియన్న, వ్యవసాయాధికారిణి ఎం.విజయనిర్మల తెలిపారు. ధ్రువీకరించిన నర్సరీల నుంచి మాత్రమే మిరప నారును కొనుగోలు చేయాలి. ఇతర రాష్ట్రాలు, జిల్లాలు, ప్రాంతాల నుంచి వచ్చే మిరపనారు కొనుగోలును ఎలాంటి ధ్రువీకరణ, బిల్లులు లేకుండా కొనుగోలు చేయవద్దు. పేరొందిన కంపెనీలు, రకాల నారును వ్యవసాయ, ఉద్యాన శాఖలచే ధ్రువీకరించిన నర్సరీల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి. ఈ విషయంలో సందేహాలు ఉంటే రైతులు ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులను సంప్రదించాలని చెప్పారు.

ప్రశ్న- సమాధానం

? యాసంగిలో కంది, పెసర సాగు చేసేందుకు అనువైన రకాలు, అవసరమైన విత్తనం.. ఎప్పటివరకు సాగు చేసుకోవచ్చో తెలపండి..? – మారపల్లి రామచంద్రారెడ్డి, హసన్‌పర్తి.



✔ యాసంగిలో పెసరను అక్టోబర్ చివరి వరకు విత్తుకోవచ్చు. పెసరలో ఎంజీజీ 295, ఎంజీజీ 397(మధిర), ఎంజీజీ 378(భద్రాద్రి), ఎంజీజీ 351(శ్రీరామ), డబ్ల్యూజీజీ 37 (ఏకశిల), డబ్ల్యూజీజీ 72(యాదాద్రి) రకాలు అనువైనవి. ఎకరాకు 6-8 కిలోల విత్తనం అవసరం ఉంటుంది. కందిని అక్టోబర్ 15 వరకు ఏక పంటగా, వేరుసెనగతో మిశ్రమంగా సాగుచేసుకోవచ్చు. కందిలో డబ్ల్యూఆర్‌జీ 53, టీడీఆర్‌జీ 4, ఆర్‌జీటీ1, పీఆర్‌జీ 158, ఎంఆర్‌జీ 41, పీఆర్‌జీ 158 ఎంజీఆర్‌జీ 1004 రకాలు అనువైనవి. ఎకరాకు 6-8 కిలోల విత్తనం అవసరం. విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి.

-కె.దామోదర్‌రెడ్డి, ఏడీఏ, నర్సంపేట

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే



రైతు రవీందర్



సర్వి చెట్లు.. ఆదాయానికి మెట్లు

న్యూస్‌టుడే, రేగొండ(భూపాలపల్లి జిల్లా) : తక్కువ పెట్టుబడితో సర్వి మొక్కల పెంపకం చేపడితే మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం భాగిర్థిపేట గ్రామానికి చెందిన రైతు రవీందర్.. ఎకరానికి మూడేళ్లకు సుమారు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని 'రైతేరాజు'కు వివరించారు. 'భాగిర్థిపేటలో రెండెకరాలు, కొత్తపల్లిలో మరో రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. కొత్తపల్లి గ్రామంలోని వ్యవసాయ భూమిలో రెండేళ్ల కిందట ఆయిల్‌పామ్ సాగు చేశాను. ఓ మిత్రుడి సూచనతో అంతర్గత పంటగా సర్వి మొక్కల పెంపకం చేపట్టాను. సిర్పూర్ కాగజ్‌నగర్ పేపర్ మిల్లు నుంచి రూ.2.40 పైసలకో మొక్క చొప్పున సుమారు 3600 మొక్కలు కొనుగోలు చేశాను. ఐదుగురు కూలీల సాయంతో రెండెకరాల్లో 19 నెలల కింద మొక్కలను నాటాను. 30 నుంచి 36 నెలలకు మొక్కలు కటింగ్ దశకు చేరుతాయి. ఒక్కో టన్నుకు రూ.5600 నుంచి రూ.6600 వరకు ధర ఉంటుందని కంపెనీ వారు చెప్పారు. ఎకరానికి సుమారు 60 నుంచి 70 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. రెండెకరాల్లో సుమారు 120 నుంచి 140 టన్నుల వరకు కలప వస్తే, టన్నుకు రూ.5600 ధర ఉన్నా ఆదాయం రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు వచ్చే అవకాశం ఉందని రైతు ఆశాభావం వ్యక్తం చేశారు. కంపెనీ(పేపర్ మిల్లు) వారే కొనుగోలు చేస్తామని చెప్పడంతో ఎలాంటి మార్కెటింగ్ ఇబ్బందులు లేవు. మొక్కలు, కూలీల, కలుపు మందులు రూపేణా ఇప్పటివరకు కేవలం రూ.10 వేల మాత్రమే ఖర్చయింది. ఆయిల్‌పామ్ కాత దశకు చేరేసరికి సర్వి మొక్కల పెంపకం పెంపకం అయిపోతుందని' వివరించారు.



బతుకమ్మ ఆట స్థలం ఎక్కడో..?

మహదేవపూర్ మండల కేంద్రంలో సద్దుల బతుకమ్మ ఆడే స్థలంపై సందిగ్ధత నెలకొంది. ప్రతిసారి సద్దుల బతుకమ్మ ఆడే కాలనీలు, ఆలయాల ఆవరణలో ఆడి.. అనంతరం ఎర్ర చెరువు ప్రాంతానికి చేరుకొని మహిళలు సామూహికంగా బతుకమ్మ ఆడతారు. పంచాయతీ ఆధ్వర్యంలో ప్రతిసారి విద్యుత్తు దీపాల అలంకరణ, సౌకర్యాలు కల్పిస్తారు. ఈసారి చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పనుల్లో భాగంగా ఎర్ర చెరువు పునరుద్ధరణ, అభివృద్ధి, విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఆయా ప్రాంతంలో మట్టి కుప్పలుపోసి ఇబ్బందికరంగా ఉంది. దీంతో బతుకమ్మ ఏర్పాట్లపై సందిగ్ధత నెలకొంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కల్పనను వివరణ కోరగా.. మంగళవారం ప్రత్యేకాధికారి పరిశీలన చేసి.. స్థలం గుర్తిస్తారని తెలిపారు.

– న్యూస్‌టుడే, మహదేవపూర్(భూపాలపల్లి జిల్లా)

టేకు.. సరిహద్దులు దాటుతోంది!

న్యూస్‌టుడే, పలిమెల (భూపాలపల్లి జిల్లా)

మానవ మనుగడకు వనాలు ఎంతో అవసరమని భావించి ప్రభుత్వాలు అడవుల సంరక్షణకు కృషి చేస్తున్నాయి. కానీ, స్వలాభం కోసం అక్రమార్కులు కలప అక్రమ రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మన ప్రాంతంలోని అడవుల్లో సరైన వృక్షాలు లేకపోవడంతో మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి దిగుమతి చేస్తున్నారు. అర్ధరాత్రి వేళల్లో గుట్టుగా తరలిస్తున్నారు. కొన్నాళ్లు స్తబ్దుగా ఉన్న స్మగ్లర్లు మళ్లీ కలప దందాకు తెరలేపి యథేచ్ఛగా దందా కొనసాగిస్తున్నారు.



గోదావరిపై కలప దాటిస్తున్న దృశ్యం(పాత చిత్రం)

తీర ప్రాంతాలే కేంద్రంగా

మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ దుంగలను గోదావరి ద్వారా దమ్మూరు, గుమ్మడికొండ రేవు, పలిమెల పెద్దవాగు, లెంకలగడ్డ, అంబటిపల్లి తీర ప్రాంతాలను కేంద్రాలుగా చేసుకొని కలప దాటిస్తున్నారు. దాటించిన కలపను పలిమెల అక్రమార్కులు అడుగు కలపకు రూ.వెయ్యి చెల్లించి కొనుగోలు చేస్తారు. అటవీ అధికారులకు దొరక్కుండా దుంగలను స్థానిక అడవుల్లో లేదా నది మడుగుల్లో దాచిపెడతారు.

రాత్రి వేళల్లో రవాణా

అటవీ అధికారులు పొద్దంతా విధులు నిర్వహించి సాయంత్రం పాత మండలమైన మహదేవపూర్‌కు వెళ్లిపోతారు. ఇదే అదనుగా దుంగలను దాచిన దుంగలను రాత్రి సమయంలో అడుగుకు రూ.2000 చొప్పున విక్రయించి రాత్రి సమయంలో కార్లు, డీసీఎంల ద్వారా భూపాలపల్లి, ములుగు, వరంగల్, కరీంనగర్ తదితర ప్రాంతాలకు తరలిస్తూ రూ.లక్షల్లో వ్యాపారం చేస్తున్నారు. గత నెలలో మూడు సార్లు, ఈ నెలలో గత శనివారం రూ.లక్షల విలువ చేసే కలపను డీసీఎం ద్వారా రవాణా చేసినట్లు సమాచారం.

కలప దందాను అరికడతాం

-నాగరాజు, పలిమెల రేంజ్ అధికారి

అక్రమ టేకు దందాపై నిఘా పెంచాం. కలప దాటించే ప్రాంతాలైన దమ్మూరు, లెంకలగడ్డ, గుమ్మడికొండరేవు వద్ద రాత్రి సమయంలో గస్తీ సిబ్బందితో గస్తీ కాస్తున్నాం. టేకు కలప దాటించే వారిపై చర్యలు తీసుకుంటాం. దందాను పూర్తిగా అరికడతాం.

టేకు దుంగలు స్వాధీనం



పలిమెల : మండలంలోని లెంకలగడ్డ పరిధి పెద్దంపేట గోదావరి మీదుగా కొందరు దుంగలను అక్రమంగా టేకు కలప దాటిస్తున్నట్లు సమాచారం అందడంతో నది తీరంలో తనిఖీలు చేసి నిల్వ చేసిన ఎనిమిది టేకు దుంగలను సోమవారం పట్టుకున్నట్లు పలిమెల రేంజి అధికారి నాగరాజు తెలిపారు. దుంగల విలువ రూ.97,000 ఉంటుందని, కలపను మహదేవపూర్ టింబర్ డిపోకు తరలించామని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా

టేకుమట్ల: 96032 95502, భూపాలపల్లి: 94408 47097, భూపాలపల్లి రూరల్: 99592 57553 (10 AM TO 1 PM)

భూపాలపల్లి : పట్టణంలోని లక్ష్మీనగర్‌లో రెండు వాటర్ ట్యాంకుల సమీపంలో రోడ్డు పక్కన చెత్త చెదారం పేరుకు పోయి దుర్వాసన వస్తోంది. దోమలు, పందుల బెడద ఎక్కువైంది. **- చంద్రమౌళి, లక్ష్మీనగర్**

పారిశుద్ధ్య కార్మికులను పంపించి రోడ్డు పక్కన పేరుకు పోయిన చెత్త చెదారాన్ని తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. **- రవీందర్, వార్డు కౌన్సిలర్**

భూపాలపల్లి : పట్టణంలోని బాంబులగడ్డ ప్రాంతంలో పూలమ్మ విగ్రహం సమీపంలో వీధి దీపాలు వారం రోజులుగా వెలుగకపోవడంతో ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న మహిళలు, చిన్న పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. **- చంద్రయ, బాంబులగడ్డ**

విద్యుత్తు సరఫరా పర్యవేక్షించే సిబ్బందిని పంపించి, వెంటనే వీధి దీపాలు అమర్చడానికి చర్యలు తీసుకుంటాం. **- పి.శారద, వార్డు కౌన్సిలర్**

కొలిక్కిరాని ఏటీసీ నిర్మాణం..!



స్థానికులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్

కాటారం, న్యూస్‌టుడే : యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)ను ఆధునీకరించి నైపుణ్యాలు తీర్చిదిద్దే అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణం కొలిక్కి రావడం లేదు.. గతంలో ఐటీఐ, ఏటీసీ నిర్మాణానికి గంగారం గ్రామంలో స్థలాన్ని కేటాయించినా అక్రమణ, వివాదంతో ముందుకు సాగలేదు. దీంతో మండల కేంద్రంలో మినీ స్టేడియం ప్రతిపాదించిన తిమ్మనకుంటలో అధికారులు ఎకరం భూమి కేటాయించారు. కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్ పూర్తిస్థాయిలో పర్యవేక్షించి త్వరితగతిన పనులు చేపట్టాలని ఆదేశించారు. సదరు తిమ్మనకుంట స్థలంలోనూ తమ భూములు ఉన్నాయంటూ పలువురు స్థానికులు అడ్డుపడుతుండడంతో ఏటీసీ నిర్మాణంలో జాప్యం జరుగుతోంది.

కొనసాగిన స్థల సర్వే : ఏటీసీ నిర్మాణ స్థలంలో తమ పట్టా భూములు ఉన్నాయని పలువురు ఆక్షేపించడంతో వారి భూములకు సంబంధించి సోమవారం పోలీస్ బందోబస్తు మధ్య సర్వే నిర్వహించారు. కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్ స్థానికులతో మాట్లాడి వివరాలు ఆరాతీశారు. డిప్యూటీ సర్వే ఇన్‌స్పెక్టర్ గణేష్‌జాదవ్, సర్వేయర్ వినయ్‌లు 43, 44 సర్వే నంబర్లలో హద్దులు నిర్ణయించారు. తమ ఇళ్ల స్థలాలు పక్కాగా చూపెట్టాలని అభ్యంతరం తెలపడంతో పాటు తహసీల్దార్ నాగరాజును కలిసి విన్నవించారు. కార్యక్రమంలో కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, ఎంపీడీవో బాబు, ఎస్సైలు అభినవ్, నరేష్, పంచాయతీ కార్యదర్శి షగీర్‌ఖాన్ ఉన్నారు.

క్షణికావేశంలో ఒకరి ఆత్మహత్య



వెంకటస్వామి (పాత చిత్రం)

మహాముత్తారం, న్యూస్‌టుడే : క్షణికావేశంలో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని నల్లగుంట మీనాజిపేటలో చోటుచేసుకుంది.. హెడ్‌కానిస్టేబుల్ రాజయ్యగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కౌటం వెంకటస్వామి(52) పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్నారు. ఎద్దుల బండి ఇటీవల మరమ్మతుకు గురికాగా కుమారుడు శనివారం బాగు చేయించేందుకు సిద్ధమయ్యాడు. నాకు చెప్పకుండా ఎందుకు తీసుకెళ్తున్నావని.. కుమారుడితో తండ్రి గొడవకు దిగాడు. ప్రతి విషయంలోనూ తన అభిప్రాయంతో సంబంధం లేకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. క్షణికావేశంలో పంట చేను వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండు రోజులైనా ఇంటికి రాకపోయేసరికి వ్యవసాయ క్షేత్రం వద్ద గాలించగా మృతదేహం సోమవారం లభ్యమైంది. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సుందర్(పాతచిత్రం)

మహాముత్తారం, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని మహాముత్తారం-యామన్‌పల్లి రహదారిపై చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం మండల కేంద్రానికి చెందిన సింగనవేని సుందర్(23) వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై మహాముత్తారం వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో యామన్‌పల్లి శివారులోని మూలమలుపు వద్ద సోమవారం రాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. దీంతో రోడ్డు కింద ఉన్న కాల్వలో పడిపోయాడు. తలకు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అతివేగమే ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

టేకుమట్ల, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై గోగికారి ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. చిట్యాల మండలం జూకల్‌కి చెందిన పవుడాల రాజు, చిలపాక ఆంజనేయులు కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలంలో ఇంటింటికీ తిరిగి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేశారు. దాదాపు 10 క్వింటాళ్ల బియ్యాన్ని వాహనంలో సోమవారం జూకల్‌కి తరలిస్తుండగా.. మార్గంమధ్యలోని టేకుమట్ల మండల కేంద్రంలో పోలీసులకు పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. పట్టుబడిన బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై దాట్ల కుమారస్వామి, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, సిబ్బంది రాజయ్య, గంగరాజు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే : ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ సోమవారం తెలిపారు. మండలంలోని రంగాపూర్ గ్రామంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎలాంటి అనుమతి పత్రాలులేని రెండు ఇసుక ట్రాక్టర్లు టేకుమట్ల మండలంలోని రాఘవరెడ్డిపేట వాగు నుంచి పట్టణానికి తరలిస్తున్నట్లు గుర్తించారు. ట్రాక్టర్ ఓనర్లు టేకుమట్ల మండలంలోని అరేపల్లి గ్రామానికి చెందిన ఎండీ చాంద్‌పాషా, గజ్జి రమేష్, గుమ్మడవల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ ఎం.అనిల్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మండలంలో ఎవరైనా ఇసుక అక్రమ రవాణా చేస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

క్వార్టర్ల కౌన్సెలింగ్‌లో అక్రమాలపై ఆందోళన



ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులతో కార్మికులు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: భూపాలపల్లి సింగరేణి డివిజన్‌లో ఖాళీగా ఉన్న క్వార్టర్ల కేటాయింపునకు సోమవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ.. స్థానిక గనుల వృత్తి శిక్షణ కేంద్రం వద్ద కార్మికులు ధర్నా చేపట్టారు. భూపాలపల్లి ఏరియాలో ప్రైవేటు వ్యక్తులకు ఎందుకు క్వార్టర్లు కేటాయించారని ప్రశ్నించడమే కాకుండా మొత్తం ఖాళీగా ఉన్న క్వార్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ.. కొద్దిసేపు కార్మికులు ఆందోళనకు దిగారు. 171 క్వార్టర్ల కేటాయింపునకు ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభించడంతో గుర్తింపు సంఘమైన ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘమైన ఐఎన్‌టీయూసీ నాయకులు ఎం. రమేష్, జోగ బుచ్చయ్య, తదితర సంఘాల నాయకులతో పాటు కార్మికులు చేరుకున్నారు. సీనియార్టీ ప్రకారం కార్మికులకు క్వార్టర్లను కేటాయించే క్రమంలోనే ఒక్కసారిగా కార్మికులు ఆందోళనకు దిగారు. 300 పైగా క్వార్టర్లు ఖాళీగా ఉంటే కేవలం 171 క్వార్టర్లకే ఎందుకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారని, కార్మికులకు నోటీసు బోర్డు ద్వారా తెలియపర్చలేదనే కారణంతో ధర్నా చేపట్టినట్లు ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు రమేష్, బుచ్చయ్య తెలిపారు. రామప్ప కాలనీలో 56 క్వార్టర్లు ఎంబీబీఎస్ విద్యార్థులకు కేటాయించడంతో కార్మికులు నష్టపోతున్నారని ఆరోపించారు. ఈ క్రమంలోనే అధికారులు కౌన్సెలింగ్ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కార్మికులు ఆందోళన విరమించారు. కౌన్సెలింగ్ కోసం హాజరైన కార్మికులకు మస్టర్లు చెల్లించేలా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘం నాయకులు యాజమాన్యంపై ఒత్తిడి చేయాలని బీఎంఎస్ నాయకులు సుజేందర్, మల్లేష్ డిమాండ్ చేశారు.

మద్యం కృత్రిమ కొరతపై ఫిర్యాదు

కాటారం, న్యూస్‌టుడే : కాటారం సబ్ డివిజన్ పరిధిలోని మద్యం దుకాణాల్లో పలు బ్రాండ్ల మద్యం కృత్రిమ కొరత సృష్టిస్తూ అధిక ధరలకు గొలుసు దుకాణాలకు విక్రయిస్తున్నారని మండల కేంద్రానికి చెందిన రామిళ్ల రాజబాబు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మకు సోమవారం ఫిర్యాదు చేశాడు. పలు బ్రాండ్ల కృత్రిమ కొరతతో గొలుసు దుకాణాల్లో అధిక ధరలకు కొనాల్సి వస్తోందని పేర్కొన్నారు. గొలుసు దుకాణాలను నియంత్రించి, సదరు మద్యం దుకాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నృత్యకారిణికి పురస్కారం



మల్హర్, న్యూస్‌టుడే : జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో ప్రతిభ కనబర్చిన మల్హర్ మండలం అన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన అలకనంద 'నాట్య కిరణం' పురస్కారం అందుకున్నారు. స్వర మధురిమ కల్చరల్ అకాడమీ ఖమ్మం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో అతిథులు అవార్డు ప్రదానం చేసి సన్మానించారు. బాల కళాకారిణి అలకనంద నృత్య ప్రదర్శనలో ఆకట్టుకుని అవార్డులు సొంతం చేసుకోవడంపై పలువురు అభినందిస్తున్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

రేగొండ, న్యూస్‌టుడే : రేగొండ మండలం తిర్మలగిరి, కొత్తపల్లిగోరి మండలం జగ్గయ్యపేట గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనకు మంగళవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు రానున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సయ్య సోమవారం తెలిపారు. జగ్గయ్యపేట నుంచి శ్రీబుగులోని వేంకటేశ్వరస్వామి ఆలయం, కొత్తపల్లి(బీ) గ్రామం నుంచి పాండవుల గుట్ట వరకు, రావులపల్లి నుంచి పాండవులగుట్ట వరకు వేయనున్న బీటీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నట్లు మండలాధ్యక్షుడు చెప్పారు.

విద్యార్థినికి సన్మానం

భూపాలపల్లి, న్యూస్‌టుడే : ఇటీవల ప్రకటించిన నీట్ ఫలితాల్లో భూపాలపల్లి పట్టణంలోని రెడ్డికాలనీకి చెందిన పిడుగు మారుతిరావు, శ్రీదేవి దంపతుల కూతురు నిహారికకు రాష్ట్ర స్థాయిలో 432 ర్యాంకు సాధించిన ఉస్మానియా మెడికల్ కళాశాలలో సీటు సాధించిన నిహారికను సోమవారం బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భీమనాథుని సత్యనారాయణ శాలువాతో ఘనంగా సత్కరించారు. రాబోయే కాలంలో మెడిసిన్‌లో పీజీ పూర్తి చేసి, జిల్లాలో పేదలకు మెరుగైన వైద్యాన్ని అందించాలని సత్యనారాయణ ఆకాంక్షించారు. కాలనీవాసులు మారం కొంరయ్య, కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ వైస్ ఛైర్మన్ జన్మదిన వేడుకలు



భూపాలపల్లి, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని భారాస కార్యాలయంలో సోమవారం భూపాలపల్లి పురపాలక సంఘం మాజీ వైస్ ఛైర్మన్ కొత్త హరిబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కోసి, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భారాస జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, పట్టణ కమిటీ అధ్యక్షుడు జనార్దన్, నాయకులు సిద్దూ, హరీష్‌రెడ్డి, చిరంజీవి, పూర్ణచందర్, సుధాకర తదితర నాయకులు పాల్గొన్నారు. స్థానిక టీబీజీకేఎస్ కార్యాలయంలో వైస్‌ఛైర్మన్ హరిబాబు జన్మదినం సందర్భంగా కేక్‌కోసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బడితల సమ్మయ్య, మధు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

గుడుంబా విక్రయిస్తే చర్యలు తప్పవు

కాళేశ్వరం, న్యూస్‌టుడే : గుడుంబా విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కాళేశ్వరం ఎస్సై చక్రపాణి హెచ్చరించారు. ఆయన ఆధ్వర్యంలో పూస్కుపల్లిలో సోమవారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటా తనిఖీలు చేపట్టారు. నిఘానేత్రాల ఆవశ్యకతను వివరించారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

రేగొండ : భాగిర్థిపేట గ్రామంలోని గుడుంబా స్థావరాలపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్సై సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో ఇళ్లల్లో తనిఖీ చేపట్టారు. సాంబలక్ష్మి, సురేష్, సమ్మయ్య, సీత అనే నలుగురి ఇళ్లల్లో అక్రమంగా నిల్వ చేసిన 20 లీటర్ల నాటుసారా కనిపించగా స్వాధీనం చేసుకున్నారు.

పోగొట్టుకున్న చరవాణి అప్పగింత

పలిమెల, న్యూస్‌టుడే : మండలంలోని ముకునూరు గ్రామానికి చెందిన తిప్పనల్లి సాగర్ వారం క్రితం ఫోన్ పోయిందని ఠాణాలో ఫిర్యాదు చేయగా.. ఎస్సై తమాషారెడ్డి సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సోమవారం ఫోన్‌ని ట్రేస్ చేసి బాధితునికి అప్పగించారు. విధి నిర్వహణలో చురుకుగా పనిచేసిన కానిస్టేబుల్ సంతోష్‌ను అభినందించారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే : ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ సునీతకు సోమవారం వినతిపత్రం అందించారు. మండల పరిధిలోని పెద్దవాగు పరివాహక ప్రాంత గ్రామాలైన వేములపల్లి, బంగ్లాపల్లి, వాగొడ్డుపల్లి, ముల్కలపల్లి, మొగుళ్లపల్లి, కొర్కిశాల, బద్దంపల్లి, పోతుగల్ గ్రామాల నుంచి పట్టణాలకు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని.. ఈ విషయంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఇసుక రవాణా నిర్వాహకులపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకొని, ప్రకృతి వనరులను కాపాడేందుకు కృషి చేయాలని వినతిపత్రం కోరినట్లు ఆయన తెలిపారు.

పారాయణాలు.. కుంకుమార్చనలు



కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహాచండీ దేవిగా



మహదేవపూర్ గంగ దేవి ఆలయంలో...

భూపాలపల్లి, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహాచండీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు మండలాల్లో ప్రతిష్ఠించిన అమ్మవార్ల విగ్రహాల దగ్గర కుంకుమార్చనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

మహదేవపూర్ : మండలంలో శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మండల కేంద్రంలోని దుబ్బగూడెంలో మహాచండీ హోమం నిర్వహించారు. గంగదేవి, గర్భగౌరి సంస్థాన్, బెగ్లూర్‌లోని మల్లికార్జున స్వామి ఆలయాల్లో అమ్మవారు లలిత త్రిపుర సుందరి, చండీ దేవిగా దర్శనమిచ్చారు. సామూహికంగా లలిత సహస్రనామ పారాయణం చేశారు.

ప్రజల గుండెల్లో ఎర్రజెండా



మాట్లాడుతున్న పోలం రాజేందర్

మహాముత్తారం, న్యూస్‌టుడే : దోపిడీ, అణచివేత, సామాజిక అంతరాలు ఉన్నంతకాలం ఎర్రజెండాను ఎవరూ ఏం చేయలేరని సీపీఎం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్ అన్నారు. మండలంలోని పోలంపల్లిలో ద్వితీయ మండల మహాసభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి, సమస్త మానవాళి బాగుండాలంటే ఎర్ర జెండా పార్టీతోనే సాధ్యమని చెప్పారు. సీపీఎం ఏర్పాటై దశాబ్దాలు గడిచినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉందని అన్నారు. మతోన్మాద భాజపా పార్టీ.. సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడమే లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు ఎ.శ్రీకాంత్, నాయకులు మానేటి బాపు, బి.సునిత పాల్గొన్నారు.

విద్యార్థులను ఆదర్శంగా తీర్చిదిద్దాలి..



మాట్లాడుతున్న సింగరేణి జీఎం హబీబ్ హుస్సేన్

భూపాలపల్లి, న్యూస్‌టుడే : భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సింగరేణి కాలరీస్‌కు సంబంధించిన 'అడల్ట్ లీడర్స్' అందరూ గ్రూపుల్లో నైపుణ్యం పెంచుకుంటూ, విద్యార్థులను ఆదర్శంగా తీర్చిదిద్దాలని భూపాలపల్లి సింగరేణి జనరల్ మేనేజర్ హబీబ్ హుస్సేన్ కోరారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాలలో అడల్ట్ లీడర్స్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అన్ని ఏరియాల నుంచి 52 మంది స్కౌట్ లీడర్‌లు, మాస్టర్లు, టీం లీడర్లు పాల్గొన్నారు. డిస్ట్రిక్ ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటస్వామి, కె.భాస్కర్, సాయినిరంజన్, భూపాలపల్లి ఏరియా రోవర్ స్కౌట్ లీడర్ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

● సింగరేణి ఫ్యామిలీ డే సందర్భంగా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ క్రీడా మైదానంలో సోమవారం మహిళలకు వివిధ ఆటలపోటీలు నిర్వహించారు. పోటీల్లో పలు కార్మిక కాలనీలకు చెందిన మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన వారికి ఈ నెల 9న సాయంత్రం స్థానిక జీఎం హబీబ్ హుస్సేన్ చేతులమీదుగా బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ పర్సనల్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, సేవా సమితి కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల నియామక పత్రాల అందజేతకు ఏర్పాట్లు

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే : డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు ఈ నెల 9న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలు అందజేయనున్నందున తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఎస్సీ అభ్యర్థులను హైదరాబాద్ తరలించేందుకు బస్సుల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 220 మంది అభ్యర్థులు డీఎస్సీకి ఎంపికయ్యారని వారిని హైదరాబాద్ తరలించేందుకు 5 బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి బస్సుకు లైజన్ అధికారులుగా ఎంఈవో, పోలీస్ కానిస్టేబుల్‌ను పంపించాలని చెప్పారు. మార్గమధ్యంలో అల్పాహారం, భోజన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈవో రాజేందర్, డీఆర్డీవో అవినాశ్, ఆర్డీవో మంగిలాల్, కలెక్టరేట్ ఏవో ఖాజా మోహియొద్దీన్ పాల్గొన్నారు.

ప్రజల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి, న్యూస్‌టుడే : ప్రజల ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారించి సత్వరమే పరిష్కరించి, బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా సమర్థంగా పనిచేయాలని సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో 17 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత అధికారులతో చరవాణిలో మాట్లాడి.. చట్టపరిధిలోని సమస్యలతో పాటు పెండింగ్‌లో ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు.

మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



భూపాలపల్లి, న్యూస్‌టుడే: భూపాలపల్లి ఏరియాలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ బ్రాంచి కార్యదర్శి కంపెటి రాజయ్య కోరారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం స్థానిక ఎస్‌వోటు జీఎం కవీంద్రకు ఇచ్చారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. ఆ మధ్యకాలంలో సింగరేణి సంస్థలో మహిళా ఉద్యోగులు పెద్దఎత్తున చేరుతున్నారని, వారికోసం ప్రత్యేకంగా క్లబ్ ఏర్పాటు చేయాలని, సీ2 మాదిరి క్వార్టర్లను కౌన్సెలింగ్ ద్వారా మహిళా ఉద్యోగులకు కేటాయించాలని కోరారు. జీఎం కార్యాలయంలోనూ మహిళా ఉద్యోగులకు ప్రత్యేకంగా వసతులు కల్పించాలని పేర్కొన్నారు. ఆయన వెంట పలువురు మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎరువుల అధిక ధరలపై ఫిర్యాదు



కాటారం, న్యూస్‌టుడే : స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని, విజిలెన్స్ విచారణ చేయాలని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ రాహుల్ శర్మకు మండల కేంద్రానికి చెందిన రామిళ్ల రాజబాబు అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ప్రైవేట్ ఎరువుల దుకాణాలకు సమానంగా విక్రయిస్తున్నారని, సామాన్య రైతుల నుంచి అధికంగా డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించాడు. అనధికారికంగా తీసుకుంటున్న డబ్బులను సంఘం ఖాతాలో జమచేస్తున్నారా..? ఎవరికి చెందుతున్నాయో పూర్తిస్థాయిలో విజిలెన్స్ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సహకార అధికారి ఎం.వాల్యానాయక్ స్థానిక పీఏసీఎస్‌ను తనిఖీ చేశారు. రికార్డులు, క్రయ విక్రయాల వివరాలు, పేమెంట్స్, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. జిల్లా కలెక్టర్‌కు విక్రయాలపై పూర్తి స్థాయి నివేదిక అందజేస్తామని పేర్కొన్నారు.

సీపీఎం నాయకుల నిరసన



భూపాలపల్లి, న్యూస్‌టుడే : ఇజ్రాయెల్‌లో మారణకాండను నిలుపుదల చేయడానికి భారత ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం జిల్లా కేంద్రంలోని కారల్‌మార్క్స్‌కాలనీలో సీపీఎం జిల్లా నాయకులు వెలిశెట్టి రాజయ్య ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రాజయ్య మాట్లాడుతూ.. సామ్రాజ్యవాద అమెరికా అండదండలతో ఇజ్రాయెల్ చేస్తున్న దురాక్రమణపూరిత యుద్ధ దాడులతో అక్కడి ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఇప్పటికే వేలాది మంది మరణించారని, అంతర్జాతీయ న్యాయస్థానం చొరవ తీసుకొని, దాడులు నిలుపుదల చేయడానికి కృషి చేయాలని కోరారు. నాయకులు రమేష్, శేఖర్, లక్ష్మయ్య, లింగయ్య, గీత, జాన్సీ పాల్గొన్నారు.